## క్లుప్తంగా

### ఎమ్మెల్యే సామేల్‌ను కలిసిన నాయకులు



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సామేల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

**మద్దిరాల :** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం హైదరాబాద్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లు అశోక్‌రెడ్డి, బర్పటి ప్రవీణ్, వడ్డాణం రమేష్, ముక్కాల అనిల్, వెంకన్న, శ్రీను ఉపేందర్ పాల్గొన్నారు.

### అవిశ్వాసం పెట్టాలని నోటీసు

**దురాజ్‌పల్లి :** నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయబాబుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. ఈ మేరకు శనివారం అవిశ్వాస తీర్మాన ప్రతిని (నోటీస్) సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావుకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పది మంది కౌన్సిలర్ల సంతకాలు ఉన్న అవిశ్వాస తీర్మానం ప్రతిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీర్మాన ప్రతిని మున్సిపల్ కమిషనర్ మరో సారి పరిశీలించాలని, అలాగే మున్సిపల్ చట్టంలోని నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. తీర్మాన ప్రతిని అందించిన వారిలో కౌన్సిలర్లు కె.వెంకట్‌రెడ్డి, బి.జితేందర్‌రెడ్డి, బి.ప్రకాష్, ఆర్.నాగయ్య, వి.నాగమణి, ఎస్.సుగుణ, ఏ.సరిత, కె.సరిత, కె.సులోచన, బి.లలిత ఉన్నారు.

### దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

**చివ్వెంల :** దురాజ్‌పల్లి ఆవాసం రామ్‌కోటి తండాలోని చార్లెట్ హోం అనాథాశ్రమంలో శనివారం పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన బైరెడ్డి నాగార్జున్‌రెడ్డి, విజయమ్మ దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు డేవిడ్ రాజ్, మంజుల, సాగర్ పాల్గొన్నారు.

### ఎస్ఎంసీ మాజీ చైర్మన్ మృతి

**పెన్‌పహాడ్ :** మండల కేంద్రానికి చెందిన ఎస్ఎంసీ మాజీ చైర్మన్ నంబి వెంకటేశ్వర్లు(75) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల సురేష్‌రావులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జానకమ్మ, మండల కో ఆప్షన్ మెంబర్ రఫీ, శెనగాని రాంబాబుగౌడ్, బంటు నారాయణ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### హెచ్ఎంకు సన్మానం



హెచ్ఎం తబిత దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ బాలునాయక్, ఉపాధ్యాయులు

**అర్వపల్లి :** జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలిగా పదేళ్లపాటు పనిచేసి బదిలీపై సూర్యాపేట మండలం యర్కారం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంగా వెళ్లిన కె.తబితను శనివారం పాఠశాలలో ఎంఈఓ బి.బాలు నాయక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదేళ్ల పాటు హెచ్ఎంగా పనిచేసి తబిత పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకట్‌రెడ్డి, వివిధ పాఠశాలల హెచ్ఎంలు సుధాకర్, సోమయ్య, ఉపాధ్యాయులు మంజుల, ఇందిర, ఉమ, రాజ్యలక్ష్మి, ప్రసన్న, రజని, యాదగిరి, వెంకటేశ్వర్లు, లింగస్వామి, వీరప్రసాద్, వెంకట్, చంద్రకళ, జలంధర్, ప్రకాశం పాల్గొన్నారు.

### సూర్యక్షేత్రం సందర్శన

**అర్వపల్లి :** తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని శనివారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని గౌతమి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. అర్చకులు క్షేత్ర విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు క్షేత్రం ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, రామకోటి స్థూపాలను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ భిక్షపతిగౌడ్, అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



సూర్యక్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు

# అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు

- ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాని వైనం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

**ఆత్మకూర్ (ఎస్) :** గ్రామాల్లో చిన్నచిన్న సభలు, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మండల వ్యాప్తంగా 2017 నుంచి ఎస్సీ కమ్యూనిటీ హాళ్లను మంజూరు చేసింది. కానీ 7, 8 సంవత్సరాలు దాటినా నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో కమ్యూనిటీ హాళ్లు వినియోగంలోకి రాలేదు. కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్ని చోట్ల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇంతవరకు పనులే ప్రారంభం కాలేదు. దీంతో ఎస్సీలపై ప్రేమ వ్యక్తం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం కమిటీ హాళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**నత్తనడకన నిర్మాణాలు..**

ఆత్మకూరు మండల వ్యాప్తంగా 19 పాత గ్రామపంచాయతీల్లో ఎస్సీ కమ్యూనిటీ హాళ్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా పాత సూర్యాపేటలో రూ.7.50 లక్షలు, ఏనుబాములలో



నసీంపేటలో పిల్లర్ల దశలోనే ఉన్న ఎస్సీ కమ్యూనిటీహాల్

రూ.25 లక్షలు, ఇస్తాళపురంలో రూ.7.50 లక్షలు, రామన్నగూడెంలో రూ.7.50 లక్షలు, ఏపూరులో రూ.25 లక్షలు, బొప్పారంలో రూ.7.50లక్షలు, మక్తా కొత్తగూడెం రూ.7.5 లక్షలు, మిడతనపల్లిలో రూ.7.5 లక్షలు, దాచారంలో రూ.7.5 లక్షల వ్యయంతో నిర్మాణాలు పూర్తి కాగా భవనాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు. అదేవిధంగా కందగట్లలో రూ.20 లక్షలు, ఆత్మకూరులో రూ.50 లక్షలు, శెట్టి గూడెంలో రూ.25 లక్షలు, కోటపహాడ్‌లో ఏడున్నర లక్షలు మంజూరు కాగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. అదేవిధంగా గట్టికల్‌లో రూ.7.5 లక్షలు, పాతర్లపహాడ్‌లో రూ.25 లక్షలు, ముక్కుడుదేవులపల్లిలో రూ.25 లక్షలు, తుమ్మలపెన్‌పహాడ్‌లో రూ.25 లక్షలు, నసీంపేటలో రూ.7.5 లక్షలతో భవనాలు మంజూరు కాగా పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. ముక్కుడుదేవులపల్లిలో నేటికీ స్థల సేకరణ పూర్తి కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాలవాసులు నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### వినియోగంలోకి తేవాలి



మండలంలో మంజూరైన ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వమైనా ఎస్సీలపై చిన్నచూపు చూడకుండా ఈ భవన నిర్మాణాలను పూర్తి చేయించాలి. నిధులు మంజూరైన ప్రతిచోట కమ్యూనిటీ హాళ్లు వినియోగంలోకి వచ్చేలా చూడాలి.

– ముల్కలపెల్లి కరుణాకర్

# గోవిందమాల మహా మండల పూజ

**భానుపురి :** పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోవింద మాల భక్తబృందం ఆధ్వర్యంలో శనివారం మహామండల పూజ, సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్షంగా సహస్ర కలశాభిషేకాన్ని నిర్వహించారు. వేయి కలశాలతో అనేక నదీ జలాలు, సముద్ర జలాలు, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలు, పండ్ల రసాలు, కొబ్బరి జలాలతో ఘనంగా మహా మండల పూజ ముగిసింది. అనంతరం శ్రీఅహోబిల జీయర్ స్వామి మాట్లాడారు. భానుపురి పట్టణ భక్తులు గోవింద మాల దీక్ష ధారణ చేయడమే కాకుండా సహస్ర కలశ అభిషేకం నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ రామాయణం చదవాలని, తద్వారా ఉన్నత జీవితాన్ని పొందగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాంచరాత్ర ఆగమ పండితులు రఘు దత్తుఆచార్యులు, నల్లాన్ చక్రవర్తుల హరిచరణ్ ఆచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, సంకర్షణ ఆచార్యులు, శ్రీహరి ఆచార్యులు, గోవిందమాల భక్తులు శ్రీనివాస్, నాగరాజు, రమేష్, బూర నాగరాజు, దంతాల చంద్రశేఖర్, వెంకటాచారి, పట్టణ ప్రముఖులు, వికాస తరంగిణి ఆండాళ్ గోష్ఠి భక్తబృందం తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహా మండల పూజ నిర్వహిస్తున్న అర్చకులు

### రేపు కంటి వైద్యశిబిరం

**భానుపురి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఈ నెల 18వ తేదీన వరంగల్‌కు చెందిన మ్యాక్సివిజన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్ రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే వైద్యపరీక్షలకు పెన్షనర్లు తమ హెల్త్ కార్డును తీసుకొనిరావాలని కోరారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



తిరుమలగిరిలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ



నాగారం : పస్తాలలోని చర్చిలో దుప్పట్లను పంపిణీ చేస్తున్న సోనియాజాన్

**తిరుమలగిరి :** తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని కవనెంట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇండియన్ క్రిస్టియన్ మినిస్ట్రీ పాస్టర్ జేమ్స్ సహకారంతో దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, పాస్టర్ సంసోన్, కందుకూరి లక్ష్మయ్య, భద్రుపాల్ నాయక్, విజయ్‌పాల్‌నాయక్, వాన్సన్‌రాజు, ఇరుగు సంగీత తదితరులు పాల్గొన్నారు.

**నూతన క్యాలెండర్ పంపిణీ..**

తిరుమలగిరి మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రేవపురుషోత్తం, గంట సాల్‌మన్, యాకూబ్, విజయ్, పెరుమాండ్ల చిన్ని, ప్రభుదాస్, వరుణ్, నాగార్జున, జైశీల పాల్గొన్నారు.

**నాగారం :** పస్తాలలోని బేతేలు కమ్యూనిటీ సెంటర్ (చర్చి)లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం సోనియాజాన్ ఆధ్వర్యంలో 500 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాన్‌మార్క్, సాల్మాన్, మల్లరాజు, సతీష్, యోహాను, బాలు, జాన్, జాకబ్, ఆయా గ్రామాల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహాధర్నా కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

**భానుపురి :** ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ఈ నెల 21వ తేదీన నిర్వహించే చలో ఢిల్లీ మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలడుగు పరశురాం మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో చలో ఢిల్లీ మహాధర్నా కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలను మోసం చేసి ఓట్లు దండుకుందని ఆరోపించారు. మళ్లీ ప్రస్తుత ఎన్నికల్లోను ఎస్సీ వర్గీకరణ చేపడతామని మాయమాటలు చెబుతూ మాదిగలను మభ్యపెడుతుందని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో 30 సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ పట్టణ అధ్యక్షుడు ఏర్పుల సాయి మాదిగ, మహిళా పట్టణ అధ్యక్షురాలు పిడమర్తి సునీత మాదిగ, పట్టణ ఉపాధ్యక్షుడు దైద ఉపేందర్ మాదిగ, నాగయ్య, దుబ్బ రమేష్ మాదిగ పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ జన్మదిన వేడుకలు

**తిరుమలగిరి :** తుంగతుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తిరుమలగిరిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, కౌన్సిలర్లు శ్రీలత, జ్యోతి పాల్గొన్నారు.



తిరుమలగిరిలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు

**నాగారం :** మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నల్లగొండలో కిషోర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ..**

మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో బీఆర్ఎస్ మైనార్టీ సంయుక్త కార్యదర్శి షేక్.నజీర్ పాష ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్.యాకూబ్, హుస్సేన్, మధార్, జానిపాష, ఉమర్, అనిల్, పవన్, ఖాసీం పాల్గొన్నారు.

**తుంగతుర్తి :** మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, రాములు పాల్గొన్నారు.

**నూతనకల్ :** మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, భూరెడ్డి సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, బద్దం ప్రశాంత్‌రెడ్డి, పన్నాల సైదిరెడ్డి పాల్గొన్నారు.

**మద్దిరాల :** మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ఏ రజాక్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, దుగ్యాల రవీందర్‌రావు, మధుసూదన్ పాల్గొన్నారు.

# బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే



అర్వపల్లి : కోమటిపల్లిలో సంచార జాతుల కుటుంబాల గుడిసెల వద్ద సర్వే చేస్తున్న సీఆర్పీ

**అర్వపల్లి :** గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలు, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను గుర్తించడానికై శనివారం కోమటిపల్లి, సూర్యానాయక్‌తండా తదితర గ్రామాల్లో సీఆర్పీ రామిడి వెంకట్‌రెడ్డి ఇంటింటి సర్వే చేశారు. సర్వే పూర్తయ్యాక బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించనున్నట్లు చెప్పారు. గుర్తించిన పిల్లల వివరాలను ప్రతిరోజు ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు.



నాగారం : పస్తాలలో సర్వే చేస్తున్న సీఆర్పీ

**నాగారం :** పస్తాల, చంద్రారెడ్డినగర్ గ్రామాల్లో బడి బయట ఉండే పిల్లలను గుర్తించేందుకు క్లస్టర్ సీఆర్పీలు శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలలకు వెళ్లని పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పిల్లల వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు స్వామిగౌడ్, హరిప్రసాద్, ఆయా గ్రామాల హెచ్ఎంలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశం

**నాగారం :** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల (పీటీఎం) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థుల ప్రగతి, పఠన సామర్థ్యాలు, పాఠశాలల్లోని మౌలిక వసతులపై చర్చించారు. అలాగే ప్రతి పాఠశాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక పీరియడ్‌ను కేటాయిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మక్సూద్, రమేష్, ఉపాధ్యాయులు దేవా, సుధాకర్, రమేష్, రాము, ఆయా పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**పిల్లలను పాఠశాలకు పంపాలి**

**అర్వపల్లి :** పిల్లలను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ప్రతిరోజూ పాఠశాలకు పంపాలని రామన్నగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిప్పలపెల్లి ధర్మయ్య కోరారు. శనివారం పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి పిల్లల తల్లిదండ్రులతో పాటు దాతలు సహకరించాలని కోరారు. మన ఊరు–మన బడి ద్వారా పాఠశాలకు అన్ని వసతులు సమకూరాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తవిటి సైదులు, ఉపాధ్యాయినిలు నీరజ, విజయలక్ష్మి, శైలజ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**విద్యార్థుల ప్రగతిని పరిశీలించాలి**

**పెన్‌పహాడ్ :** ప్రతి నెలా విద్యార్థుల ప్రగతిని పరిశీలించాలని సెక్టోరియల్ అధికారి శ్రవణ్‌కుమార్, ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. శనివారం సింగారెడ్డిపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో యాజమాన్య కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మేదరి సోమయ్య, హెచ్ఎం నల్లా శ్రీనివాసులు, ఉపాధ్యాయురాలు పోరెడ్డి హైమావతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పస్తాలలోని పాఠశాలలో సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

**సమర్థవంతంగా నిర్వహించాలి**

**ఆత్మకూరు (ఎస్) :** పాఠశాలల్లో నిర్వహించే విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి ధారా సింగ్ అన్నారు. శనివారం నెమ్మికల్, ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పీటీఎం సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి నెలా జరిగే ఈ సమావేశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధిపై చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నెమ్మికల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీహరి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యశ్రీ, ఆత్మకూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శంకర్ నాయక్, సుదర్శన్ రెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.



అర్వపల్లి : రామన్నగూడెంలోని పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్ఎం ధర్మయ్య

**విద్యాభ్యాసంలో తల్లిదండ్రులే కీలకం**

**నూతనకల్ :** విద్యార్థుల విద్యాభ్యాసంలో తల్లిదండ్రుల పాత్రే కీలకమని ఎంపీడీఓ ఇందిర అన్నారు. శనివారం మండల పరిధిలోని తాళ్లసింగారం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించిన విద్యను ప్రతి తల్లిదండ్రి ఇంటి దగ్గర పరీక్షించి విద్యార్థులకు మెలకువలు నేర్పించాలని ఆమె కోరారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం ప్రధానమని.. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాములు నాయక్, ప్రధానోపాధ్యాయుడు శెనిగల యాదగిరి, సీఆర్పీ వీరస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి



ఆత్మకూర్ (ఎస్) : మాట్లాడుతున్న ఎంఈఓ



నూతనకల్ : మాట్లాడుతున్న ఎంపీడీఓ ఇందిర

# నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

**అర్వపల్లి :** జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఆదివారం (నేటి)నుంచి వచ్చే నెల 14 వరకు ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తొలి రోజు శోభాయాత్ర కార్యక్రమం జరుగనుంది. విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించనున్నారు. సూర్యాపేటలోని హనుమాన్ చాలీసా భక్త బృందంచే పారాయణం, భజనలు, నాగారం గ్రామానికి చెందిన కోలాట బృందాలచే వివిధ కార్యక్రమాలు జరపనున్నారు. ధనుర్మాస ఉత్సవాల విజయవంతానికై శనివారం రాత్రి ఆలయంలో గ్రామస్తులచే సమావేశం నిర్వహించారు. ఉత్సవాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్ తెలిపారు.

# గడ్డికి నిప్పు.. పర్యావరణానికి ముప్పు

**చివ్వెంల :** వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు రైతులు కూలీల సహాయంతో వరి పంటలు కోసి బండ్ల ద్వారా తమ కల్లాలకు చేర్చేవారు. అనంతరం కూలీల ద్వారా కాడెద్దుల సహాయంతో బంతికొట్టి ధాన్యాన్ని గడ్డిని వేరు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రస్తుతం వరికోతలకు రైతులంతా యంత్రాలను వినియోగిస్తున్నారు. అయితే యంత్రాల సహాయంతో పంటను కోసిన తర్వాత గడ్డిని కొంతమంది రైతులు వ్యవసాయ భూముల్లోనే కాల్చుతున్నారు. ఇలా వరిగడ్డిని కాల్చడం వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందని వ్యవసాయ అధికారులు అంటున్నారు. మంటల వల్ల తీవ్రస్థాయిలో కాలుష్యం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. వ్యవసాయ భూముల్లో గడ్డికి నిప్పు పెట్టకూడదని రైతులకు సూచిస్తున్నారు. ఈ విషయమై అవగాహన కూడా కల్పిస్తున్నారు. కానీ కొంతమంది రైతులు మాత్రం అవేమీ పట్టించుకోవడంలేదు.

**పశుగ్రాసం కొరత..**

గతంలో వరి కోతలు పూర్తయిన తర్వాత రైతులు పశువులకు ఏడాదికి సరిపడ గడ్డిని వాముల రూపంలో నిల్వచేసేవారు. అయితే ఇప్పుడు యంత్రాల ద్వారా వరికోయడంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడుతోంది. ఒకప్పుడు గ్రామాల్లో ఉచితంగా లభించే గడ్డి ఇప్పుడు అత్యంత ఖరీదుగా మారింది. ఒకప్పుడు మోపు గడ్డి రూ.20నుంచి 30 ఉండగా, ప్రస్తుతం రూ.80 నుంచి 100 పలుకుతోంది.



వాల్యతండాలో కాలి బూడిదైన గడ్డి

### అవగాహన కల్పిస్తున్నాం

పొలాల్లో గడ్డితోపాటు కొయ్యకాళ్లకు నిప్పు పెట్టకుండా మండలంలోని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గడ్డికి నిప్పు పెట్టడం వల్ల జరిగే నష్టాలను వివరిస్తున్నాం. అయినప్పటికీ కొంతమంది రైతులు వరి గడ్డిని తగులబెడుతున్నారు.

– ఎ.ఆశోకుమారి, మండల వ్యవసాయ అధికారి

# వికాస్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

**సూర్యాపేట రూరల్ :** బీ ఫార్మసీ, ఫార్మాడీ పూర్తి చేసిన విద్యార్థులందరికీ వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్లు సిస్ట్రాన్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్, సీఎస్‌కే బయోకేర్ కంపెనీల సీఈఓ జె.కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం వికాస్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 20 ఏళ్లలో వికాస్ ఫార్మసీ కళాశాల అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కె.రామదాస్, ఆడెపు రమేష్, వైస్ ప్రిన్సిపల్ కిషోర్‌కుమార్, దేవరాయ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న కృష్ణప్రసాద్

### రక్తదాన శిబిరం ఏర్పాటు

**అర్వపల్లి :** తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ జన్మదినం సందర్భంగా శనివారం అర్వపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, నాయకులు కల్లెట్లపల్లి శోభన్‌బాబు, మొరిశెట్టి ఉపేందర్, బొడ్డు రామలింగయ్యయాదవ్, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఇసుక డంప్ సీజ్

**మద్దిరాల :** జి.కొత్తపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను అధికారులు సీజ్ చేశారు. జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దాదాపు 15 ట్రిప్పుల ఇసుకను అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వహీద్ గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట పోలీస్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

### పోలీస్ సిబ్బందికి అవగాహన

**కోదాడరూరల్ :** సైబర్ నేరాల దర్యాప్తులో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో సైబర్ నేరాల మోసాలపై కేసుల నమోదు, దర్యాప్తు తదితర అంశాలపై డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ మోసాలు కూడా ఎక్కువయ్యాయన్నారు. ఈ విధమైన మోసాలు జరిగినపుడు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్, ముఖ్య ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. సైబర్ మోసాల నివారణకు యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీఐలు రామకృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, రాము, రాఘవులు, రవి, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణిలో దరఖాస్తు

**కోదాడరూరల్ :** ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతూ ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అన్నెం పాపిరెడ్డి శనివారం వినతిపత్రం అందజేశారు. నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఆదర్శ రైతు వ్యవస్థను తీసుకొచ్చాడని తెలిపారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం తమను తొలగించిందని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు తమను తిరిగి తీసుకోవాలని వారు వినతిపత్రంలో కోరారు.